# పారాహుషార్

''కంగ్రాచ్యులేషన్స్...'' నలుగురు స్నేహితులూ, అందమైన గాజుగ్లాసుల్లో పోసిన ద్రవం గొంతులో పోసుకుంటూ, సామంత్‌ని అభినందించారు.

''ఎవర్రా సామంత్ ఆ అదృష్టవంతురాలు?'' ప్రఫుల్ అడిగాడు. సామంత్ బిగ్గరగా నవ్వాడు.

''నేను అదృష్టవంతుడిని!... ఆ అమ్మాయి కాదు. మా మావగారు లక్షాధికారి. అమ్మాయి ఎమ్. ఎ. పాసయింది. ఒక్కతే కూతురు. ఆస్తంతా పెళ్లైన మరుక్షణం నుంచీ మనదే. పాపం! ఎంత ఆస్తి ఉంటేయేం? ముప్పైయేళ్ళొచ్చాయి పెళ్ళికాలేదు. ఇన్నాళ్లకా అదృష్టం మనల్ని వరించింది.''

''అందంగా ఉంటుందా?'' అడిగాడు సంజయ్.

''ఇల్లు ఇరకటం... అలి మరకటం... అన్నారు కదోయ్... అందుకే భార్యగా అనాకారి కావాలనుకున్నాను. అయినా ఆస్తిముందు అందందేనికి... అందమైన ప్రియురాళ్ళు కోకొల్లలు ఉన్నారు'' సామంత్ మాటలు పూర్తికాకుండానే తలుపు టక టక చప్పుడైంది.

సామంత్ లేచి తలుపు తీశాడు. ఎదురుగా తెల్లని చుడీదార్‌లో వెన్నెల కన్యలా మెరుస్తోన్న నీలిమని చూస్తూనే ఆనందంగా ఆహ్వానించాడు.

లోపలికొచ్చిన నీలిమ అక్కడి వాతావరణం, అతని స్నేహితుల్ని చూసి ఒక అడుగు వెనక్కి వేసింది కంపరంగా.

సామంత్ స్నేహితులకి ఆమెని పరిచయం చేశాడు. వాళ్లు నలుగురూ తూలుతూ లేచి, నీలిమని విష్‌చేసి, సామంత్ భుజం తడుతూ, ''ఓ...కె... బ్రదర్... ఎంజాయ్'' అంటూ బైటకెళ్లిపోయారు.

సామంత్ వాలకం చూసి, '' ఏమిటీ అవతారం, రాత్రి ఎనిమిది కూడా కాకుండా'' అన్నది.

''ఆనందం డియర్... ఆనందం... కమాన్ నువ్వూరా నా ఆనందంలో పాలుపంచుకో!'' ఆమె నడుంచుట్టూ చేయివేసి నడిపించుకుంటూ వచ్చి సోఫాలో కూర్చోబెట్టాడు.

''ఈ ఆనందం అంతా పెళ్లి సంబంధం కుదిరినందుకేనా?''

''నో! నో! లక్షాధికారి అల్లుడిని కాబోతున్నందుకు నీలూ! యూ ఆర్ బ్యూటిఫుల్... ఐ లవ్ యూ''

నీలిమ నవ్వింది. ముగ్ధుడైపోయాడు సామంత్.

పరిచయం అయిన వారంలోనే నా మనసు దోచేసుకున్నావు అనుకోకుండా ఇలా వచ్చినందుకు నన్ను ఆనందపెట్టవూ!'' ఆమెని దగ్గరికి లాక్కొంటూ అన్నాడు.

నీలిమ సున్నితంగా విడిపించుకుంటూ, అతడిని పరిశీలనగా చూసింది. జీవితం మీద ఏ అభిప్రాయం. భవిష్యత్తుపై ఏ లక్ష్యం లేని వాడిలా ఉన్నాడు. అందగాడే... ఆ అందంలో ఏదో లోటు అతనిలోని స్వార్థమో! అతని విచ్చలవిడితనమో! ఆ అందంలో సహజత్వాన్ని చంపేసింది.

''ఏవిటి అలా చూస్తున్నావు? నేను స్మార్ట్‌గా లేనా?'' అడిగాడు.

''లేకేం!...'' నవ్వింది.

''అయితే... మరి ఓ చిన్న''

''సామంత్! నీ పెళ్ళి సెటిల్ అయింది''

''సో!'' కళ్ళెత్తి ఆమెవైపు చూసి నవ్వాడు.

''ఏం ఫర్వాలేదు. పెళ్ళిచేసుకున్నంత మాత్రాన నిన్ను ప్రేమించలేనా? చాలాకాలంగా తనకన్నెచెర వదిలించేవాడికోసం ఎదురుచూస్తోంది ఆమె. పోనీలెమ్మని ఒప్పుకున్నాను. లక్షలాస్తి మనదైపోతోంటే బాధదేనికి? పెళ్ళి అయిన మరునాటినుంచీ, ఆ ఆస్తిమీద సర్వాధికారాలూ మనవే. చూస్తుండు. సరిగ్గా నెలరోజుల్లో నిన్ను బంగారంతో నింపేస్తాను.''

నీలిమ జుగుప్సగా చూసింది సామంత్ వైపు.

''నీకు...నీకు అలా మాట్లాడటానికి సిగ్గనిపించటంలేదూ!''

''ఎందుకు సిగ్గు? డబ్బుకోసంకాక ఆ భూతంలాంటి అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోమంటావా? నేనేకాదు. ఏ మగవాడూ చేసుకోడు. అయినా వాళ్లు మాత్రం డబ్బాశ చూపించి, నన్ను ఒప్పించలేదా? వాళ్లు

మాత్రం సిగ్గుపడళ్లేదా?''

''సామంత్! ప్రేమ, అనురాగం, అవగాహనలేకుండా డబ్బుకోసం ఈ పెళ్ళికి ఒప్పుకున్నావే! పెళ్ళంటే ఓ పవిత్రమైన బంధంగా కాకుండా, వ్యాపారంలా భావిస్తున్నావే, నీకసలు పెళ్ళెందుకు?''

''పెళ్ళి... బంధం... పవిత్రం... ఈ డైలాగ్స్ మీ ఆడవాళ్లకు అలవాటైపోయాయి. మీలో ఎంతమంది ఆడవాళ్లు పెళ్ళిని కమర్షియల్‌గాకాక పవిత్రమైన బంధంగా భావిస్తున్నారు? ఏ మాత్రం పరిచయంలేని మా మధ్య ఏదో ప్రేమ పొంగిపోతుందని ఎందుకాశిస్తున్నావు?''

''ప్రేమ ఈ అమ్మాయి మీద పెంచుకోమనటంలేదు. నీకెంతోమంది ఫ్రెండ్స్ ఉన్నారుగా. వాళ్లల్లో నీకిష్టమైన, నిన్ను ఇష్టపడిన అమ్మాయిని జీవిత భాగస్వామిగా చేసుకోవచ్చుకదా!''

గలగలా నవ్వాడు సామంత్.

''నాకు నచ్చిన అమ్మాయి. నీకో రహస్యం తెలుసా? నాతో ఏ అమ్మాయైనా సుఖాల్ని పంచుకుంటుంది కానీ, జీవితాన్ని పంచుకోదు. ఎందుకంటే భయం. తిరుగుబోతునని, తాగుబోతుననీ భయం. అయినా పెళ్ళికాకుండా నాతో సుఖాల్ని పంచుకునే అమ్మాయిని నేనెలా పెళ్లి చేసుకుంటాను? పెళ్లికి డబ్బున్న అమ్మాయి కావాలి... ఆస్తి పరురాలైతే నా భవిష్యత్తు ఎంతో బాగుంటుంది.''

''హెల్... డబ్బుకోసం పెళ్లి చేసుకుంటావా?'' చీదరగా అన్నది నీలిమ.

''మళ్లీ అదే మాటంటావేం? మగవాళ్ళు తాగుబోతులనీ, తిరుగుబోతులనీ, దురాశపరులనీ తెలిసి మీ ఆడవాళ్లంతా పెళ్లికోసం ఎందుకలా వెంపర్లాడతారు? స్టేటస్... కేవలం స్టేటస్‌కోసం... మంగళసూత్రాలనే లైసెన్స్ వేసుకుంటే ఈ సమాజం మిమ్మల్ని గౌరవిస్తుంది. అందుకు... అందుకు పెళ్ళి చేసుకుంటారు. అది హెల్ కాదా?

ఈ సమాజంలో పెళ్ళికాని ఆడపిల్లంటే చిన్న చూపు. ఎంత డబ్బున్నా సకాలంలో పెళ్ళికాకపోతే, పదిమంది మాటల ఈటెలు విసురుతుంటారు. అందుకని... ఆ ఈటెల బారినుండి తప్పించుకుని, సమాజంలో పొందబోయే గౌరవంకోసం ఎవడో ఒకడిని ముడి వేసుకుని, వాడు పెట్టే చిత్రహింసలు భరిస్తూ, లోలోపల తిట్టుకుంటూ అసహ్యించుకుంటూ,

పైకి మాత్రం ప్రేమఒలక బోస్తుంటారు అది తప్పుకాదా?''

నీలిమ అవాక్కైచూసింది అతడివైపు. ''సామంతేనా ఇలా మాట్లాడింది?'' అతని మాటల్లో ఆల్కహాల్ మత్తుగానీ, తొట్రుపాటుగానీ లేదు. నిస్సంకోచంగా ఎంతోకాలంగా మనసులో దాచుకున్న భావాల్ని బైటపెట్టడానికి అవకాశంకోసం చూస్తున్నవాడిలా నిశ్చలంగా మాట్లాడాడు.

కానీ...కానీ...అతను అన్నది ఎంతవరకు సమంజసం? స్త్రీలంతా నిజంగా సామంత్ చెప్పినట్లు, పెళ్ళి, భర్త అనే పదాలకు అర్థం తెలీని వాళ్లలా ప్రవర్తిస్తున్నారా? ''పెళ్ళి'' కేవలం వ్యాపారంలా భావిస్తున్నారా? నీలిమ భావాలు గ్రహించినవాడిలా మళ్లీ అన్నాడు.

''పూర్వకాలంలో, ఏమీ తెలీని వయసులోనో, తెలిసీ తెలియని వయసులోనో పెళ్ళిళ్ళు చేస్తే, పెళ్ళిని ఓ వేడుకలా భావిస్తూ, ఆ సందర్భంగా వచ్చే చీరలు - నగలు చూసుకుని పొంగిపోతూ, పెళ్ళంటే అంతే అనుకునేవారు.

కానీ, మీరంతా చదువుకున్నారు. తెలివిమీరారు. అభ్యుదయం. అభ్యుదయం అంటూ గొంతుచించుకుంటున్నారు. కానీ, ఇలా పెళ్ళంటె బోలెడన్ని చీరలు, నగలు వచ్చే వేడుకగా భావించే మనస్తత్వం మీలో చాలామందికి పోలేదంటే మీరు ఒప్పుకోరు. అలా అన్న నాలాంటి వాళ్ళని చీల్చిచెండాడతారు. ఒక్కసారి మనస్ఫూర్తిగా ఆలోచించి,... మీ దృక్పథంలో ఉన్న లోపాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తే మీ జీవితాలు ఇంత భయంకరంగా ఉండవేమో!''

''సామంత్! నువ్వు... నువ్వు...'' నీలిమ మాట్లాడ లేక చిత్తరువులా చూసింది.

''ఏం? నాగురించి అంతో, ఇంతో వాకబు చేసి ఉంటారుగా భుజంగరావుగారు. నేనెలాంటి వాడ్నో తెలిసాకకూడా తనకూతుర్ని ఎలా ఇస్తున్నారు? పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయివుండీ ఆ అమ్మాయెలా ఒప్పుకుంది?''

నీలిమ నిద్రలోంచి లేచిన దానిలా మెల్లిగా తేరుకుని అన్నది.

''స్త్రీలంటే నీకింత చిన్నచూపెలాకలిగింది?''

''హు...చిన్నచూపు'' విరక్తిగా నవ్వాడు సామంత్.

''మా అమ్మ బతికున్నంతకాలం మానాన్నని అనుమానాల్తో

కాల్చుకుతింది. మా అక్క నగలు... చీరలు... క్లబ్బులు అంటూ బావగారి యోగక్షేమాలకెప్పుడూ ప్రాధాన్యమివ్వలేదు. అలాగే నాకు తటస్థపడే స్త్రీలుకూడా నామీద ప్రేమతో నాతో గడపరు...''

నీలిమకి సామంత్ అభిప్రాయాల్ని ఖండించాలని ఉంది. కానీ, గొంతుకేదో అడ్డం పడినట్లె... ఏం మాట్లాడలేకపోతోంది. అతని మాటల్ని పూర్తిగా వ్యతిరేకించలేకపోతోంది. స్త్రీలు అలా ప్రవర్తించడానికి ఏదో కారణం ఉండే ఉంటుంది... అదేవిటో తనకి ఈ సమయంలో తట్టక స్త్రీల తరపున సామంత్ దగ్గర ఓడిపోవాల్సి వస్తోంది.

చటుక్కున బ్యాగ్ చేతిలోకి తీసుకుని, వెళ్లటానికి ఉద్యుక్తురాలవుతూ అన్నది.

''సామంత్! నీ అభిప్రాయాల్లో ఎంత నిజం ఉందో నాకు తెలియదు. కానీ నా తరపునుంచి, నీ అభిప్రాయం తప్పని తప్పక రుజువు చేస్తాను. అంతవరకూ సెలవు.''

సామంత్ నవ్వాడు.

''నా అభిప్రాయాలు అందరిమీదా రుద్దను. కానీ, దాదాపు డెబ్బై అయిదు శాతం మంది పెళ్లిని ఓ అనుబంధంలా కాక కమర్షియల్‌గా చూస్తున్నారన్నది మాత్రం నిజం... ఎనీవే... నీకిష్టం లేకుండా నిన్ను బలవంతంగా అనుభవిస్తానని అనుకోకు... నీకు నచ్చిన కుర్రాణ్ణి చూసి పెళ్ళి చేసుకుని ఆనందంగా ఉండు. ఆల్ ది బెస్ట్... ఒక్కదానివీ వెళ్లగలవా? డ్రాప్ చేయనా?''

''డ్రాప్ చేయగలవా?''

''ఏం ఇంకా హాంగోవర్‌లో ఉన్నాననుకుంటున్నావా? పద పద - బాటిల్స్ కూడా తెచ్చుకోవాలి'' నవ్వుతూ స్కూటర్ తాళాలు చేతిలోకి తీసుకున్నాడు. అతడిని అనుసరించింది.

★ ★ ★

అరవిందని ఆ రోజు పెళ్ళికూతుర్ని చేశారు. తెల్లవారితే పెళ్ళి. అధునాతనంగా ఉన్న ఆ భవనంలో దేదీవ్యమానంగా వెలుగుతున్నాయి లైట్లు - బైట ఆవరణంతా పిల్లలతో, పెద్దలతో, కోలాహలంగా ఉంది. తోటలోని ప్రతిచెట్టు లైట్లతో అలంకరించబడి అద్భుతంగా ఉంది తోటంతా.

స్నేహితురాళ్ల మధ్య కూర్చుని, వాళ్ల హాస్యోక్తులకి నవ్వుతూ... తెల్లవారితే

పెళ్ళి అన్న మధురభావనలకి పులకించిపోతోంది అరవింద.

ఇరుగుపొరుగుల, బంధువుల సూటిపోటిమాటల్తో తనకింక ఈ జన్మలో పెళ్ళి కాదనుకుని కృంగిపోయే సమయంలో మెరుపులా వాలాడు సామంత్.

కాస్త ఆలస్యంగా రాసినా, తన నుదుటిరాతలో దేవుడు అంత అందగాణ్ణి రాసినందుకు మనసులోనే నివాళులర్పించింది దైవానికి.

ఆమె తండ్రి భుజంగరావు వ్యాపారంలో ఎన్ని లౌక్యాలు, మెలకువలు చూపిస్తాడో అన్నీ కూతురి పెళ్ళి విషయంలో ప్రదర్శించాడు.

ఆయనకి తెలుసు తన కూతురు అనాకారని... అందుకనే ఒక ఆశయాన్ని దృష్టిలో పెట్టుకుని పెళ్ళికుమారుడి కోసం వెతికాడు.

సామంత్ ఆయన దృష్టిలోపడ్డాక ''కుర్రాడు చాకు... కాకపోతే కాస్త పదును పెట్టాలి'' అనుకున్నాడు.

ఆయనకిది పెద్దసమస్య కాదు.

అందరూ ఎదురుచూస్తోన్న ఆ శుభక్షణం రానే వచ్చింది. పెళ్ళి పీటలమీద సామంత్‌ని చూసిన అరవింద అనుకుంది.

''ఇతని అందానికి ఆస్తిమొత్తం ధారపోసినా ఫర్వాలేదు. కానీ, ఆ మనసులో ఏదో ఒకమూల ఒకింత చోటు సంపాదించుకోవాలి''

సామంత్ ఘనమైన ఆ ఏర్పాట్లు చూసి నవ్వుకున్నాడు. వీడియో తీయటం ఫ్యాషన్ అయిపోయింది. ఈమె అందానికి తోడు వీడియో కావల్సి వచ్చింది కాబోలు అనుకున్నాడు.

వేదమంత్రాల మధ్య, మంగళసూత్రధారణ పూర్తయింది. అత్యంత వైభవంగా జరిగిన పెళ్ళి ఏర్పాట్లు, భోజనాలు... ఇవన్నీ చూసి సామంత్ స్నేహితులు ముగ్ధులైనారు. అతని అదృష్టానికి అసూయపడ్డారు. ఇంత అత్యంత వైభవోపేతమైన ఏర్పాట్లు, సెట్టింగ్స్ సినిమాల్లో మాత్రం చూశారు. మళ్ళీ భుజంగరావింట్లో పెళ్ళికి చూశారు.

సామంత్‌కి ఇరవైఅయిదువేల రూపాయలకి చెక్కు అందించాడు భుజంగరావు.

అది చూడగానే, అతని భృకుటి ముడిపడింది.

కళ్ళెత్తి చూసిన అతనికి మెత్తని చిరునవ్వుతో అభయమిచ్చాడు భుజంగరావు.

ఆ నవ్వులో అతనికి ''పిచ్చివాడా! ఇది కేవలం బహుమానం. నా యావద్ధాస్తి నీదే అయ్యాక అనుమానందేనికి?'' అన్న భావం కనిపించింది. అంతేకాదు... ఆక్షణంలో ఆరక్షణం కళ్ళెత్తిచూసిన అరవింద కళ్ళల్లో ప్రతిఫలిస్తూన్న రాళ్ళ నగల మెరుపులు కూడా అతనికి అభయమిచ్చినట్టే అనిపించింది.

తలంబ్రాలు తంతు ప్రారంభమైంది.

కెమేరాలు క్లిక్‌మంటున్నాయి.

పెళ్ళికూతుర్ని చేసిన దగ్గర్నించీ వీడియో తీస్తున్నారు. పెళ్ళి తంతు మొత్తం, ఈషణ్మాత్రం మిస్ అవకుండా, వీడియోలోకి ఎక్కుతోంది. అద్దంలోలా ప్రతిఫలిస్తోన్న సామంత్, అరవిందల మొహాల్లోని భావాలతో సహా ప్రతి చిన్న కదలికా, వీడియోలో శాశ్వతంగా పదిలం చేయబడుతోంది.

సాయంత్రం డిన్నర్ ఏర్పాట్లు కూడా భుజంగరావే చేశాడు. సామంత్‌కి స్నేహితులు తప్ప ఎవరూలేరు. ఎక్కువమంది భుజంగరావు తరపున వచ్చిన వాళ్ళే.

మంత్రులు... ఎమ్.ఎల్.ఏలు... జడ్జీలు... ఇతర ఐ.ఎ.యస్ ఆఫీసర్లు, కమీషనర్ ఆఫ్ పోలీసు.... వీళ్ళందరినీ చూడగానే సామంత్‌కి మతిపోయింది.

తన మావగారు వ్యాపారంలో డబ్బు సంపాదించాడనుకున్నాడే కానీ, ఇంత పరపతి కూడా సంపాదించాడని అతడు ఊహించలేదు. ఒక్కొక్కరినే పేరు పేరునా, అందరికీ సామంత్‌ని పరిచయం చేశాడు. ఆ పరిచయాల సందర్భంగా భుజంగరావు సూచనల మేరకు సామంత్ వారందరితో చేస్తున్న కరచాలనం... అతని స్నేహితుల కామెంట్స్... వారి మొహాల్లోని భావాలు... వీడియోలోకి బిగుసుకుపోతున్నాయి.

అప్రయత్నంగా సామంత్ మనసులో జంకులాంటి భావం కదిలింది. బైట పడకుండా జాగ్రత్త పడ్డాడు.

అంతా పూర్తయి అతిథులంతా వెళ్ళేటప్పటికి దగ్గర దగ్గర - పన్నెండు అవుతోంది.

ఇల్లరికం ఉండమంటారనుకున్న సామంత్ ఆశ నిరాశచేస్తూ, కొత్తగా కొన్న ఇంట్లోకి వాళ్ళని పంపించాడు భుజంగరావు.

ఆరోజు రాత్రి... అప్పటికి వాళ్ళ కాపురం మొదలై మూడు రోజులైంది.

సామంత్‌కి మూడు నిద్రలతోటే భార్యతో అనుభవం మొహం మొత్తింది. తన ప్రియురాళ్ళు గుర్తొస్తున్నారతనికి.

సరసకుచేరే భర్తకోసం ఎదురుచూస్తోన్న అరవిందకి, తయారై... స్ప్రే చేసుకుని హుషారుగా బైటకెళుతున్న భర్తని చూడగానే ఈ జీవన నాటకంలో తను ప్రస్తుతం పోషించాల్సిన పాత్ర గుర్తొచ్చింది.

ఆమె మనసునిండా అతనికోసం ప్రేమానురాగాలు దోసిళ్ళతో పట్టి నింపింది. ఐతే ఇప్పుడు ఆమెకి కావాల్సింది అతనితో మూణ్ణాళ్ళ ముచ్చట కాదు. అనురాగపూరితమైన, ఆదర్శపూరితమైన జీవితం... అందుకే... ఆ క్షణం అతణ్ణి నిరోధించే ప్రయత్నం మొదలు పెట్టింది. నెమ్మదిగా గొంతు సవరించుకొని అడిగింది.

''బైటికి వెళుతున్నట్టున్నారు. నేనూరావచ్చా?'' సామంత్‌కి గొంతులో వెలక్కాయ అడ్డుపడినట్లయింది.

''ఆ... అబ్బే... ఎక్కడికీలేదు. ఊరికే అలా బైటికి...'' అన్నాడు తడబడుతూ.

''పోనీలెండి... ఆ షికారుకి నేనూ వస్తాను. నాకూ సరదా అలా తిరిగి రావడం అంటే -''

''అదికాదు... మరి...'' సామంత్‌కి ఏంచెప్పాలో అర్థంకాలేదు.

'ఇన్నాళ్ళూ ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళలేక, వెళ్ళడానికి తోడులేక చూడాల్సిన ఎన్నో ప్రదేశాలు చూడనేలేకపోయాను. ఇప్పుడన్నా మీతో కలిసి సరదాగా తిరగాలని నా కోరిక. మీరు కూడా ఇన్నాళ్ళు ఒంటరిగానే తిరిగారు కదా!''

''కానీ... కానీ... నేను - మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాలి. నువ్వు పడుకో'

''ఎవరా ఫ్రెండ్? ఆడా? మగా?'' సామంత్‌కి చిరాకేసింది.

అరవింద సూటిగా అన్నది.

''చూడండి. నా దగ్గర మీకు మొహమాటం, దాపరికం లాంటివి వద్దు. స్వేచ్ఛగా, స్నేహంగా ఉండండి. మీ శ్రేయోభిలాషిగా కొన్ని విషయాలు చెప్తున్నాను వినండి.''

''ఏవిటవి''

''చెప్తాను. మానాన్న వ్యాపారస్తుడు. లౌక్యమే పెట్టుబడిగా సాగించాడు వ్యాపారం. ఇన్ని లక్షల ఆస్తిని మిమ్మల్ని నమ్మి మీ చేతిలో పెట్టారనుకుంటే

పొరపాటే... మీ చుట్టూ కొన్ని జతల కళ్ళు పహరా కాస్తున్నాయి. మీ నీడలా ఉండే కొందరు ఇహనుంచి మీ ప్రతికదలికా కనిపెడుతుంటారు.''

''అంటే''

''అంటే... మీ కిచ్చిన పాతికవేల రూపాయల మీద తప్ప మరే విధమైన సంపదమీదా మీకు హక్కులేదు. నా పేరనే ఇల్లుకొని రిజిస్ట్రేషన్ చేయించారు. నా ప్రతి నగా బ్యాంక్‌లో రిజిష్టర్ చేయించారు. మీకిస్తానన్న రెండు లక్షల రూపాయల కట్నం నాపేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మీ జీతంలో మాత్రమే ఈ ఇల్లు గడవాలి. దానిమీద మాత్రమే మీకు హక్కుంది. నా డబ్బుతో ఈ ఇంటికోసం నేనేం చేయకూడదు. చేయను. అంతేకాదు మిస్టర్ సామంత్!''

సామంత్ అదిరిపడ్డాడు ఆ పిలుపుకి. కోపంగా అన్నాడు. ''మోసం... దగా! ఎంతకుట్ర!''

''హు...'' నిరసనగా నవ్వింది అరవింద.

''ఏది మోసం? ఏది కుట్ర? ఏ దురాలోచనా లేకుండా మీరు నన్ను మనసారా ఇష్టపడి పెళ్ళిచేసుకున్నారని నమ్మమంటారా? మీ గురించి పెళ్ళికి ముందు ఎంక్వయిరీ చేశారు. నేను అందగత్తెను కానని మానాన్నకి తెలుసు. నన్ను చేసుకునే వాళ్లు నా డబ్బుకోసమే చేసుకుంటారని కూడా తెలుసు.

అయితే అలాంటి వాళ్లలో కాస్త మంచివాడుగా కనిపించే వాళ్లని ఎన్నుకుని తనకనుకూలంగా మార్చుకోవాలన్నది ఆయన ఆశయం. గుడ్డిగా నాలాంటి అమ్మాయిని, ఈ ఆస్తిని మీకప్పగిస్తే జరిగేదేవిటో ఆయనకి అనుభవపూర్వకంగా తెలుసు.

ఆ ప్రయత్నంలో భాగంగానే ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు.

వాటిల్లో పెళ్ళికి పెద్ద పెద్ద వాళ్ళను పిలవటం, వాళ్లతో మీ పరిచయాలను వీడియోలోకెక్కించటం అలాంటివి.

వీడియో తీయడం చాలామంది సరదాగా భావిస్తారు. కానీ, మానాన్నగారు సరదాగాకాదు, ముందు జాగ్రత్తచర్యగా భావించి, మీ స్నేహితుల కామెంట్స్ దగ్గర్నుంచీ చేయించారు.

అంతేకాదు నీలిమ మా బాబాయి కూతురు. కాస్త చొరవ, ధైర్యం ఒకపాలు ఎక్కువ ఉన్న అమ్మాయి. మీ సంగతి తెలిసి, తనే మీ దగ్గరికివచ్చి

అమ్మాయిల మీద మీకున్న అభిప్రాయాలు రాబట్టి నాకు చెప్పింది.

ఇన్ని తెలిసీ, నేను మిమ్మల్ని కోరుకోవటం, మా నాన్నగారు నన్ను మీకివ్వటం తెలివి తక్కువ కాదు.

మీరు పరిస్థితుల కారణంగా చెడిపోయారనీ, సానబడితే వజ్రంలా ప్రకాశించగలరనీ మా నాన్న నమ్మకం.

నా ప్రవర్తనతో, అనురాగంతో, ప్రేమతో నేను మీ మనసుని గెల్చుకోవాలన్న పట్టుదల.. గెల్చుకోగలనన్న విశ్వాసం నాది.

మేము కాదంటే మీరు మీ అందంతో, చాకచక్యంతో నా లాంటి మరో అమ్మాయిగొంతు ఈజీగా కోయగలరు.

మీలాంటి వాళ్ల బారినుంచి ఎలా తప్పించుకోవాలో మేము ఆడపిల్లలందరికీ చెప్తాం.

మీరిప్పుడు ఈ ఊళ్లోని అత్యంత పలుకుబడి గల వ్యక్తికి అల్లుడు. ఇదివరకులా విచ్చలవిడిగా తిరిగితే ఎక్కడోక్కడ పట్టుపడతారు.

ఈ ఇంట్లో మీ స్వేచ్ఛకు అడ్డులేదు. అదీ హద్దుల్లోనే...''

అరవింద ఊపిరి తీసుకోవడంకోసం అన్నట్లుగా ఆగింది.

సామంత్‌కి చెమట్లు పట్టేసింది ఒళ్లంతా.

ఎంత తెలివిగా, పకడ్బందీగా వేశాడనుకున్న ప్లాన్ తలక్రిందులవటమేకాదు, తాను భుజంగరావు అల్లిన సాలెగూటిలో చిక్కుకుపోయాడు. ఎలా? ఎలా ఇందులోంచి బయటపడేది? డబ్బుతో స్వర్గాన్ని నిర్మించుకోవచ్చునని ఆశపడ్డాడు. ఎన్నెన్నో కలలుకన్నాడు. ఏవీ అవన్నీ? ఎక్కడ తను స్వర్గానికి వేసిన నిచ్చెనలు?

అరవింద ఇప్పుడు కురూపిలాకాదు... దుర్గాదేవిలా ఉంది. ఈమె తన భార్య... పిల్లల్ని కనేయంత్రంకానే కాదు. తన పాలిట మృత్యువు తన స్వేచ్ఛకు వేసిన సంకెల.

ఆమె జీవితం అనే చెరసాలలో బందీ అయ్యాడు తను. అరవింద అంటోంది.

''స్త్రీలపైన మీకున్న అభిప్రాయాలు సమంజసమైనవికాదు. అందరు స్త్రీల సంగతెలా ఉన్నా, నేను మాత్రం నా భర్త నా డబ్బునికాక, నన్ను నన్నుగా ప్రేమించాలని కోరుకుంటున్నాను. నా ఐశ్వర్యంతోకాక, నా

అనురాగంతో మీ మనసు గెల్చుకోవాలన్న తపన నాది. అందుకు నా జీవిత కాలం అంతా ప్రయత్నిస్తాను. ఓడిపోననే నా నమ్మకం.''

''అసంభవం...'' పిచ్చిగా అరిచాడు సామంత్.

''నీమొహం చూసి... నీ బాబు, నువ్వు చేసిన మోసానికి.. పన్నిన పన్నాగానికి నిన్ను ప్రేమించటంకాదు'' పళ్లబిగువున అన్నాడు.

అరవింద ఓ క్షణం అతనివైపు చూసి అన్నది.

''మిస్టర్ సామంత్! మీకు స్త్రీలమీద చాలా చిన్నచూపు ఉంది. అది ఆరోగ్యానికంత మంచిది కాదు. దశాబ్దాల తరబడి పురుషుడి ఆధిక్యత కింద నలిగిపోయిన స్త్రీలు ఓసారి విజృంభించి తమ ప్రతాపం చూపిస్తున్నారు.

మీరన్నట్టు ఆడపిల్లలు మీచుట్టూ తిరగడం కేవలం కాస్మెటిక్స్ - చీరల మీది మోజుకాదు. సినిమాలు, షికార్లకోసం అంతకన్నా కాదు.

ఈ దిక్కుమాలిన సమాజంలో వరుళ్ళ హిరణ్యాక్షవరాలతో, సరితూగలేక సగం యవ్వనం కన్యలుగానే గడిచిపోతుంటే... కోరికల్ని పవిత్రత... శీలం... వివాహం అనే - ముసుగుల చాటున మరుగుపరచి, జీవచ్ఛవాల్లా బతకటం ఇష్టంలేక అలా మారారు.

మగవాళ్ళు పెళ్ళియ్యేదాకా శారీరక సుఖాలు తీర్చుకోకుండానే ఉంటున్నారా? పెళ్ళికి వరాలు కోరుకునే మీ మగవాళ్ళు సెక్స్‌కి ఏవరం అడగరు. పెళ్ళి చేసుకోవాలంటే కట్నాలు ఇస్తేనేకానీ వల్లకాదనే మీ పురుష పుంగవులు, పక్కలోకి ఆడది వస్తానంటే ఎదురు డబ్బిచ్చి సుఖం కొనుక్కుంటారు. మీ ఆ బలహీనతని క్యాష్ చేసుకోవడమే ఆడపిల్లల లక్ష్యం.''

సామంత్‌కి నోట మాటరాలేదు.

తను గుక్క తిప్పుకోకుండా ఉపన్యసిస్తోంటే నీలిమ అవ్యక్తురాలిలా ఎలా చూసిందో, ప్రస్తుతం అరవింద వాగ్ధాటికి అతనూ అలాగే అయ్యాడు.

ఆ ధాటికి... తాను అరచేతిలో నిలుపుకొందామనుకున్న స్వర్గం చేజారిపోతుంటే విభ్రాంతిగా, అచేతనంగా నిలబడిపోయాడు సామంత్.

ఈనాడు ఆదివారం అనుబంధం